సాక్షి
తిరుపతి

ఆదివారం । 25 । మే । 2025



### ఎస్వీయూ విద్యార్థినుల ప్రతిభ
జీవ వైవిధ్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వ్యాస రచన పోటీల్లో ఎస్వీయూ విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. - 8లో



### గురువు పాడె మోసిన భూమన
విద్యాబుద్ధులు నేర్పిన గురువు రఘునాథరెడ్డి కన్నుమూయడంతో ఆయన భౌతికకాయానికి భూమన నివాళులర్పించారు. - 8లో




### గడువులోపు నిర్మాణాలు పూర్తి కావాలి
పేదలకు మంజూరైన ఇంటి స్థలాల్లో నిర్మాణాలను గడువులోపు పూర్తి చేయాలని ప్రత్యేకాధికారి ఆదేశించారు. - 8లో

## న్యూస్‌రీల్

### 'ఆరోగ్య వరప్రసాదిని'కి రూ.10లక్షల విరాళం



ఏఈఓకు విరాళం ఇస్తున్న దాతలు

**తిరుమల:** బెంగళూరుకు చెందిన అలెన్ కోచింగ్ ఇన్‌స్టిట్యూట్ వైస్ ప్రెసిడెంట్ మహేష్ యాదవ్ టీటీడీ బాలాజీ ఆరోగ్య వరప్రసాదిని పథకానికి రూ.10 లక్షల విరాళాన్ని శనివారం అందజేశారు. విరాళానికి చెందిన డీడీని తిరుమల అన్నమయ్యభవన్‌లో ఏఈఓ సీహెచ్ వెంకయ్య చౌదరికి దాత అందజేశారు.

### కలెక్టరేట్‌లో ఉదయం 10 గంటల నుంచే గ్రీవెన్స్

**తిరుపతి అర్బన్:** ఎండలు తగ్గి... వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సోమవారం నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఉదయం 10 గంటల నుంచి నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. రెండు నెలలుగా ఎండలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఉదయం 9 గంటల నుంచే గ్రీవెన్స్ నిర్వహిస్తూ వచ్చామని పేర్కొన్నారు. వచ్చే సోమవారం నుంచి ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మాత్రమే ఉంటుందని స్పష్టం చేశారు. కలెక్టరేట్‌తోపాటు డివిజన్, మండల స్థాయి కార్యాలయాల్లోను ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించాలని ఆదేశించారు. అలాగే కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌కు అన్ని విభాగాలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు హాజరుకావాలని ఆదేశించారు.

### సివిల్స్ ప్రిలిమనరీ పకడ్బందీ ఏర్పాట్లు



పరీక్ష కేంద్రం పరిశీలనలో కమిషనర్ మౌర్య

**తిరుపతి తుడా :** యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ ఎగ్జామినేషన్ కేంద్రాల వద్ద పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య అధికారులను ఆదేశించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆదివారం నగరంలోని 13 కేంద్రాల్లో యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ ఎగ్జామినేషన్ 2025 పరీక్షలు జరగనున్నాయని, అందుకు ఏర్పాట్లు పక్కా ఉండాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. పరీక్షలు ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్స్‌లో జరుగుతాయని అభ్యర్థులు ఎటువంటి ఒత్తిడి లేకుండా సౌకర్యంగా పరీక్షలు రాసేలా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. పరీక్షా కేంద్రాల వద్ద పరిశుభ్రంగా ఉంచాలని, విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, తాగునీరు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. కమిషనర్ వెంట అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మున్సిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ పాల్గొన్నారు.

### శ్రీవారి దర్శనానికి 24 గంటలు

**తిరుమల:** తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ శిలాతోరణం వద్దకు చేరింది. శుక్రవారం అర్ధరాత్రి వరకు 74,374 మంది స్వామి వారిని దర్శించుకోగా 37,477 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.02 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

SUNDAY SPECIAL

# ఇటు వృథా.. అటు వ్యథ!

అన్నం పరబ్రహ్మ స్వరూపంగా భావిస్తుంటాం.. భోజనం తినే ముందు పవిత్రంగా కళ్లకు అద్దుకుంటాం.. అయితే అదే ఆహార పదార్థాలను యథేచ్ఛగా వృథా చేస్తుంటాం. వివాహాది శుభకార్యాలకు పదుల సంఖ్యలో వెరైటీలతో వంటకాలను సిద్ధం చేయిస్తుంటాం.. అతిథులు ముందు ఆర్భాటంగా వడ్డిస్తుంటాం.. గొప్పల కోసం సునాయాసంగా రూ.లక్షలు వెచ్చిస్తుంటాం.. మిగిలిపోయిన వాటిని అనాయాసంగా చెత్తకుండీల పాలు చేసేస్తుంటాం.. ఇదే తిండి లేక వేలాది డొక్కలు ఎండి పోతున్నాయని ఏమాత్రం గమనించం.. ఒక్క పూట కడుపు నిండితే చాలని ఎదురు చూస్తున్నాయని అర క్షణం కూడా ఆలోచించం.. ఈ క్రమంలోనే ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా నడుచుకోవాలని పలువురు మేధావులు కోరుతున్నారు. ఆహారం వృథా చేయకుండా అభాగ్యులకు అందించే దిశగా అడుగులు వేయాలని సూచిస్తున్నారు.



ఇటీవల ఓ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో చెత్తబుట్టలో పడవేసిన ఆహారం



తిరుపతి నగరంలోని ఓ వివాహ వేడుకలో మిగిలిన ఆహార పదార్థాలను చెత్త డబ్బాలకు నింపిన దృశ్యం



రుయా ఆస్పత్రి పరిసరాల్లో ఫుట్‌పాత్‌పై కూర్చుని అన్నదాతల కోసం ఎదురు చూస్తున్న అభాగ్యులు

- పెళ్లిళ్లు.. ఫంక్షన్లలో మిగిలిపోయి చెత్తకుండీల్లో చేరుతున్న ఆహార పదార్థాలు
- మరోవైపు తినేందుకు తిండి లేక అభాగ్యుల ఆకలి కేకలు
- జిల్లాలో నగటున రోజుకు 500 కిలోల భోజనం డస్ట్‌బిన్‌ల పాలు
- శుభకార్యాల నిర్వాహకులు బాధ్యతాయుతంగా ఉండాలంటున్న మేధావులు
- సమాజంలో మార్పు తీసుకువస్తేనే వేలాది మంది క్షుద్బాధ తీరుతుందని సూచనలు

**తిరుపతి సిటీ :** ఆహారాన్ని భగవంతుని స్వరూపంగా భావించే దేశం మనది. కానీ, భోజనాన్ని భారీగా వృథా చేస్తున్న దేశాలలో జాబితాలో మనం టాప్ ఫైవ్‌లో ఉండడం గమనార్హం. గృహాలు, రెస్టారెంట్లలో పండుగలు, వివాహాలు, బర్త్‌డేలు, ఇతర ఫంక్షన్ల పేరుతో ఆరగించేదానికన్నా వృథా చేస్తున్నదే ఎక్కువగా ఉందని గణాంకాలు చెబుతున్నాయి. ప్రస్తుత సమాజంలో చాలా మంది వివాహాల నిర్వహణ నిమిత్తం ఖర్చుకు వెనుకాడడం లేదు. ఇందుకు సామాన్య ప్రజలు సైతం అతీతులు కాదు. అందరిలో గొప్పగా ఉండాలనే ఉద్దేశంతో తమ స్థాయికి మించి డబ్బులు వెచ్చిస్తున్నారు. ఈ క్రమంలో నీరు, ఆహారం భారీగానే వృథా అవుతోంది. ఇళ్లు, హోటళ్లు, ఫంక్షన్ హాళ్లు, కల్యాణ మండపాలలోనూ సగటున రోజుకు 500 కిలోల వరకు ఆహారం వృథా అవుతున్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే, మరో వైపు అదే ప్రాంతంలో వేల మంది ఆకలితో అలమటిస్తున్నారు. అయితే మిగిలిన ఆహార పదార్థాలను ఖాళీ కడుపుతో నకనకలాడే నిరుపేదలు, అనాథలకు చేరవేయడంలో నేటి ఆధునిక సమాజం విఫలమవుతోంది. కనీస మానవత్వం చూపించకుండా బాధ్యతారహితంగా వ్యవహరిస్తోంది.

#### 30శాతం చెత్తకుండీలకే..!

జిల్లాలోని ప్రధాన పుణ్యక్షేత్రాలైన తిరుపతి, శ్రీకాళహస్తిలతోపాటు మిగిలిన 33మండలాల్లో శుభముహూర్తాల సమయంలో ఏటా వేల సంఖ్యలో వివాహాలు జరుగుతుంటాయి. అందులో భోజనాలకు కనీసం సుమారు రూ.5 లక్షల నుంచి 30 లక్షల వరకు ఖర్చు చేసి 12 నుంచి 100రకాల వంటకాలను అతిథులకు వడ్డిస్తుంటారు. ఇందులో కొందరు కేవలం రెండు, మూడు రకాలు మాత్రమే భుజించి మిగిలినవి వదిలేస్తుంటారు. కనీసం 70శాతం ఆహారం కూడా పూర్తి స్థాయిలో ఖర్చుకాదు. మిగిలిన 30 శాతం చెత్తకుండీలలో వేస్తుండడం బాధాకరం. జిల్లాలో సుమారు 800 కల్యాణమండపాలు ఉండగా, ప్రతి దాంట్లోనూ జరిగే ఒక్కో కార్యక్రమంలో వృథా అవుతున్న ఆహారం సుమారు 50 కేజీలకు పైగా ఉంటోంది. అయితే అదే ఆధ్యాత్మిక పట్టణాలలోని ఆలయాలు, ఆస్పత్రులు,రహదారులు, పట్టణంలోని రద్దీ ప్రాంతాలు, ప్రధాన కూడళ్లలో వేల మంది ఆకలితో అలమటిస్తున్నారు. వారికి కల్యాణమండపాలు, ఫంక్షన్ హాళ్లలో మిగిలిన ఆహారాన్ని అందించే నాథుడే కరువయ్యాడు. కార్యక్రమ నిర్వాహకులు, క్యాటరింగ్ యాజమాన్యాలు బాధ్యతగా వ్యవహరిస్తే వృథాను అరికట్టడంతో పాటు పేదలు, అనాథల ఆకలి తీర్చే అవకాశముంటుంది.

#### ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకుంటేనే..

జిల్లాలో పేదల ఆకలి తీర్చాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకుంటేనే సాధ్యమవుతుంది. వివాహాది శుభకార్యాలలో మిగిలిన ఆహారాన్ని వృథా చేయకుండా వెంటనే కార్యనిర్వాహకులు, బంధుమిత్రులు సమీపంలోని అనాథాశ్రయాలు, రోడ్లపై అభాగ్యులకు చేరవేసే ప్రయత్నం చేయాలి. లేదా ఆహారం మిగిలిందంటూ స్వచ్ఛంద సేవాసంస్థలకు సమాచారం అందించగలగాలి. ఈ బాధ్యత కార్యక్రమానికి హాజరైన యువత, నిర్వాహకులు చేపట్టినప్పుడే సమాజంలో మార్పు వచ్చే అవకాశముంటుంది.

#### సేవా సంస్థలు ముందుకు రావాలి

గతంలో పలు స్వచ్ఛంద సేవా సంస్థలు ఇలాంటి విషయాలలో చురుకుగా పనిచేసేవి. అయితే ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడంతో వారు సైతం బాధ్యతల నుంచి తప్పుకున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో స్వచ్ఛంద సేవాసంస్థలు, అనాథాశ్రమాల నిర్వాహకులు సమీప కల్యాణ మండపాలు, ఫంక్షన్ హాళ్ల మేనేజర్, సిబ్బందికి చిరునామాతో కూడిన కాంటాక్ట్ నంబర్‌ను ఇవ్వడం ఉత్తమం. దీంతో పాటు కల్యాణ మండపాలలోని భోజనశాలల్లో ఫోన్ నంబర్లను అంటించడం ఎంతో ఉపయోగకరం.



నగరంలోని ఓ కల్యాణమండపంలో మిగిలిన ఆహార పదార్థాలను సేకరించిన స్వచ్ఛంద సంస్థ



తిరుచానూరు సమీపంలోని ఓవర్ బ్రిడ్జి వద్ద పడేసిన ఆహారం తింటున్న అభాగ్యుడు

#### జిల్లా సమాచారం

| | |
|---|---|
| మొత్తం టీటీడీ కల్యాణ మండపాలు | 52 |
| ప్రైవేట్‌గా నడుస్తున్నవి | 305 |
| ఫంక్షన్ హాళ్లు | 450 |
| ఏటా నిర్వహించే వివాహాల సంఖ్య | సుమారు 7 వేలు |
| ఇతర శుభకార్యాలు | సుమారు లక్ష |
| వేస్ట్‌గా పడేస్తున్న ఆహారం (ఒక్కో కార్యక్రమంలో) | 50కేజీల నుంచి 100కేజీలు |
| ప్రతి పూటా తిండి కోసం ఎదురు చూస్తున్న పేదలు, అనాథలు | సుమారు 12వేలు |

#### పర్యావరణానికి సైతం ప్రమాదం



వృథా కాబడిన ఆహారం పర్యావరణానికి సైతం ప్రమాదం చేకూరుస్తోంది. కర్బన ఉద్గారాలలో 10శాతం వృథాగా మారిన ఆహార పదార్థాల నుంచి వెలువడుతున్నాయి. అతిథుల మెప్పుకోసం అప్పులు చేసి వెజ్, నాన్ వెజ్ ఐటమ్స్‌ను అందిస్తుంటారు. అందులో చాలా వరకు చెత్తకుప్పలోకి చేరుతున్నాయి. వీటిని ఆకలితో అలమటించే వారికి అందిస్తే మంచిది. - కె.ప్రమీలమ్మ, కేంద్ర ప్రభుత్వ విశ్రాంత అధికారి, తిరుపతి

#### ఎందరో అలమటిస్తున్నారు



తిరుపతిలోని అలిపిరి, ప్రభుత్వాస్పత్రులు, ప్రధాన కూడళ్లలో ఎంతో మంది అభాగ్యులు కేవలం ఆహారం కోసం అలమటిస్తున్నారు. అలాంటి వారికి శుభకార్యాలలో మిగిలిన ఆహారం అందించగలిగితే ఆకలి తీర్చినవారమవుతాం. - రామచంద్రయ్య, రిటైర్డ్ అధ్యాపకుడు, తిరుపతి

#### యువతలో మార్పు వస్తేనే..



మన దేశానికి యువతే ఆస్తి. ఖాళీ సమయాల్లో స్నేహితులతో కలసి స్వచ్ఛందంగా సేవామార్గంలో నడవాలి. యువత సైతం కళాశాల నుంచి బయటకు రాగానే సేవా భావం మరిచిపోతున్నారు. యువతలో మార్పు వస్తేనే.. సమాజంలో మార్పు ప్రారంభమవుతుంది. - భార్గవ్ సాయి, స్వచ్ఛంధ సేవా సంస్థ, ట్రెజరర్, తిరుపతి

#### సమాచారం అందిస్తే చాలు



తిరుపతిలో అనాథాశ్రయం నడుపుతున్నాం. ఇప్పటికే వందల మంది అభాగ్యులను అక్కున చేర్చుకుని సేవ చేస్తున్నాం. వివాహాది శుభకార్యాలలో మిగిల ఆహార పదార్థాలను వృథా చేయకుండా మాకు అప్పగిస్తే అనాథలకు చేరవేస్తాం. మాకు సమాచారం అందిస్తే చాలు. 9700440415 నంబర్‌కు కాల్ చేయండి. - శ్రీదేవి, అనాథాశ్రమ నిర్వాహకులు, తిరుపతి

## సర్వర్ పరేషన్

- కార్డుదారులకు తప్పని తిప్పలు



నాగలాపురం సచివాలయంలో కార్డుదారులు

**తిరుపతి అర్బన్ :** కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తోంది. ఇంతకాలానికి కొత్త రేషన్‌కార్డుల విషయం గుర్తుకు వచ్చింది. అలాగే కార్డులో సభ్యుల విభజన, పేర్లు చేర్పులు, తొలగింపులు, చిరునామా మార్పులు, ఆధార్ సీడింగ్ దిద్దుబాటుకు సంబంధించి అవకాశం కల్పించింది. అయితే సర్వర్ సమస్యలు తలెత్తడంతో కార్డుదారులు నానా అవస్థలు పడుతున్నారు. సచివాలయంలో గంటల తరబడి పడిగాపులు కాస్తున్నారు.

**విభజనకే ఎక్కువ ఇక్కట్లు**

రేషన్ కార్డు విభజనకు సంబంధించి ఆధార్‌కార్డు ఉంటే సరిపోతుందని ఆదేశాలు ఉన్నప్పటికీ పలువురు సచివాలయ ఉద్యోగులకు అవగాహన లేక మ్యారేజ్ సర్టిఫికెట్‌ను అడుగుతున్నారు. దీంతో రేషన్‌కార్డు విభజన కోసం దరఖాస్తుదారులు తిప్పలు పడుతున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రస్తుతం ఏ అంశంపై అయినా ఆన్‌లైన్ నేపథ్యంలో సరిచేసుకోవాల్సి ఉంది. అయితే హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ ఎక్కడ ఉందో అక్కడే కార్డును విభజన చేసుకోవాలంటూ సచివాలయ ఉద్యోగులు తెగేసి చెప్పేస్తున్నారు. సర్వర్ చూపడం లేదంటూ మెలిక పెడుతున్నారు. ఈ క్రమంలో కొత్త జంట రేషన్‌కార్డు కోసం ప్రయత్నిస్తే, మ్యాపింగ్ మీ తల్లిదండ్రుల ఉన్నచోటే ఉందని చెప్పడం విడ్డూరంగా ఉందని పలువురు మండిపడుతున్నారు.

## ఉపాధి పనుల తనిఖీ

**ఏర్పేడు:** మండలంలోని కోబాక పంచాయతీలో జరుగుతున్న వాటర్ హార్వెస్టింగ్ పాండ్ పనులను శనివారం జిల్లా డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ తనిఖీ చేశారు. కూలీ గిట్టుబాటవుతుందా...? కూలి డబ్బులు సకాలంలో పడుతున్నాయా..? పనుల వద్ద తగిన సౌకర్యాలను ఏర్పాటు చేశారా..? అని ఆయన కూలీలను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని అన్ని గ్రామాలలో కూలీల సంఖ్య పెంచాలని ఏపీవో సుజాతను ఆదేశించారు.

## పద్మ అవార్డులకు దరఖాస్తులు

**తిరుపతి అర్బన్:** వచ్చే ఏడాది జనవరి 26 గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రతిభ చూపే పలు రంగాల వారి నుంచి పద్మ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కలెక్టర్ వెంకటేశ్వర్ శనివారం తెలిపారు. ప్రధానంగా కళలు, సాహిత్యం, విద్య, క్రీడలు, వైద్యరంగం, సామజిక సేవ, సైన్స్-ఇంజినీరింగ్, ప్రజావ్యవహారాలు, పౌరసేవలు, వాణిజ్యం, పరిశ్రమలు తదితర రంగాల్లో అత్యున్నతమైన ప్రతిభ కనపరిచిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రాష్ట్రీయ పురస్కార పోర్టల్ వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. లేదా దరఖాస్తును కలెక్టరేట్‌లో పూర్తి వివరాలతో కార్యాలయ పనిదినాలలో ఈ నెల 31వ తేదీలోపు అందజేయాలని సూచించారు.

## పెంచలకోన కిటకిట



శ్రీవారి కల్యాణంలో భక్తులు



దేవదేవేరుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

**రాపూరు:** మండలంలోని పెంచలకోన శనివారం భక్తులతో కిక్కిరిసింది. బ్రహ్మోత్సవాల అనంతరం వచ్చే రెండో శనివారం కావడంతో పెద్దసంఖ్యలో భక్తులు పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, ఆంజనేయస్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం 10 గంటలకు స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. రాత్రి ఊంజల్‌సేవ నేత్రపర్వంగా సాగింది.

## క్లుప్తంగా

### వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీ నియామకం

**తిరుపతి మంగళం :** వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీని నియమించారు. ఈ మేరకు తిరుపతికి చెందిన మన్నెం మునిరెడ్డిని రాష్ట్ర ఇంటిలెక్చువల్స్ విభాగం సంయుక్త కార్యదర్శిగా, దివ్యాంగుల విభాగం సంయుక్త కార్యదర్శిగా ఆలూరు సంజీవరాయుడు (ఆలూరు చిన్నా), పబ్లిసిటీ విభాగం కార్యదర్శిగా కట్టా గోపీయాదవ్‌ను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శనివారం ఉత్తర్వులు విడుదలయ్యాయి.

### క్షతగాత్రురాలికి హర్షిత్‌రెడ్డి సాయం



గాయపడిన మహిళకు చేయూతనందిస్తున్న చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి

**చిన్నగొట్టిగల్లు:** రక్తగాయాలతో ఆర్తనాదం చేస్తున్న మహిళకు వైఎస్సార్‌సీపీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి సాయం అందించారు. వివరాలు.. భాకరాపేట- ఎర్రావారిపాళెం మార్గంలో దీన్‌దార్లపల్లె వద్ద ఆటోలో వెళుతున్న మహిళ ప్రమాదవశాత్తు కిందపడిపోయింది. దీంతో ఆమె తలకు బలమైన గాయమైంది. అదే సమయంలో అటు వైపుగా కారులో వస్తున్న హర్షిత్‌రెడ్డి వెంటనే అక్కడ ఆగారు. క్షతగాత్రురాలికి తోడుగా కొందరు నేతలను పెట్టి వేరే వాహనంలో ఆస్పత్రికి తరలించారు. మానవత్వం చాటుకున్న హర్షిత్‌రెడ్డిని స్థానికులు అభినందించారు.

### ఎస్వీయూ విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

**తిరుపతి సిటీ:** ఆంధ్రప్రదేశ్ జీవ వైవిధ్య మండలి, గ్రీన్ క్రాప్ సంయుక్తంగా రాష్ట్ర స్థాయిలో జీవ వైవిధ్యంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో మదనపల్లి జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల బీఎస్సీ బయోటెక్నాలజీ రెండవ సంవత్సర విద్యార్థిని గుణ విజయ మొదటి స్థానంలో నిలిచారు. జిల్లా స్థాయి పోటీల్లో పద్మావతీ డిగ్రీ కళాశాల బీఎస్సీ జువాలజీ ద్వితీయ సంవత్సర విద్యార్థిని దీప్తి మొదటి స్థానం పొందారు. గుణ విజయ, దీప్తిని ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ సీహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతినాయుడు, యూనివర్సిటీ కల్చరల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్‌చౌదరి అభినందించారు.

# అభివృద్ధి లేని అరాచక పాలన

- సూపర్‌సిక్స్ హామీలను విస్మరించారు
- తిరునగరిని మద్యం మాఫియాకు అడ్డాగా మార్చేశారు
- ఏడాదిగా కూటమి ప్రభుత్వం చేసింది శూన్యం
- వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి





**తిరుపతి మంగళం :** అధికారంలోకి వస్తే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమం కంటే మించి పథకాలు అందిస్తాం.. లక్షల ఉద్యోగాలను ఇస్తాం ..యువతకు నిరుద్యోగ భృతి చెల్లిస్తాం.. తల్లికి వందనం పేరుతో ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమంది పిల్లలకు నగదు వేస్తాం.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తాం..ఏడాదికి నాలుగు ఉచిత సిలిండర్లు అందిస్తాం..రైతులకు రూ.20వేల చొప్పున సాయం చేస్తామంటూ చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఎన్నికల సమయంలో ప్రగల్భాలు పలికి ఏడాదిగా ప్రజలను మోసం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి మండిపడ్డారు. సూపర్‌సిక్స్ హామీలను అటకెక్కించారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై ఆయన 'సాక్షి'తో ఆదివారం ప్రత్యేకంగా మాట్లాడారు.

- కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికి వదిలేసింది. మోసపూరిత వాగ్దానాలు చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య.

రోడ్లపై గోతులను పూడ్చడం తప్ప తిరుపతి నగర అభివృద్ధిని పూర్తిగా విస్మరించారు.

- తిరుమలను రాజకీయ కేంద్రంగా మార్చేశారు. భువి వైకుంఠాన్ని భ్రష్టు పట్టించారు. శ్రీవారి లడ్డూ ప్రసాదంపై అసత్య ఆరోపణలు చేసిన

- ఈ ఏడాదిలో కొత్త ఉద్యోగాల సంగతి దేవుడెరుగు.. ఉన్న వాటినే తీసేశారు. ఎన్నికల సమయంలో వలంటీర్లకు రూ.10వేల గౌరవ వేతనం ఇస్తామని 3లక్షల మందిని మోసపూరితంగా తొలగించారు. 10వేల మంది ఎండీయూ ఆపరేటర్ల పొట్టకొట్టారు. యువతకు కనీసం నిరుద్యోగ భృతిని కూడా ఇవ్వడం లేదు.

- పవిత్ర పుణ్యక్షేత్రం తిరుపతిలో మద్యం ఏరులై పారుతోంది. నిత్యం గోవింద నామస్మరణలతో మారుమోగాల్సిన ఆధ్యాత్మిక నగరం మందుబాబుల ఆగడాలతో దద్దరిల్లుతోంది. రాత్రింబవళ్లు మద్యం విక్రయాలు సాగుతున్నాయి. తిరుపతి వచ్చిన వారికి మద్యం దుకాణానే ముందుగా కనిపిస్తున్నాయి.

ప్పుడే చంద్రబాబుకు పతనం మొదలైంది. తిరుమల చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల జారీలో తొక్కిసలాట జరిగి ఆరుగురు మృతి చెందడం దారుణం. విచ్చలవిడిగా మద్యం, మాంసం విక్రయాలు, ఎర్రచందనం స్మగ్లింగ్, శ్రీవారి ఆలయం వద్ద కొందరు బిరియానీ తినడం, ఆలయంలోకి చెప్పులతో వెళ్లడం, కొండపై ఓ వ్యక్తి నమాజ్ చేయడం హిందువుల మనోభావాలను దెబ్బతీశాయి.

- ఐదేళ్ల జగనన్న పాలన రామరాజ్యంలా సాగింది. జగనన్న సహకారం, అప్పటి తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి కృషితో నగరంలో అభివృద్ధి పరుగులు పెట్టింది. 18 మాస్టర్‌ప్లాన్ రోడ్లను నిర్మించి ఆధ్యాత్మిక నగరంలో ట్రాఫిక్ సమస్య లేకుండా చేసిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుంది. సత్యనారాయణపురం నుంచి మున్సిపల్ పార్క్ వైపు మాస్టర్‌ప్లాన్ రోడ్డు చివరిలో మిగిలిపోయిన వందమీటర్లను కూటమి ప్రభుత్వం పూర్తి చేయలేకపోయింది.

# గురువు పాడె మోసిన భూమన



రఘునాథరెడ్డి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న భూమన కరుణాకరరెడ్డి

**తిరుపతి మంగళం :** విద్యాబుద్ధులు నేర్పి ఉన్నత భవితకు బాటలు వేసేవారు గురువులు. తమ శిష్యులు ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షిస్తారు. అలాంటి గురువు పాడెను మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి మోశారు. తనకు విద్యాబుద్ధులు నేర్పిన గురువు రఘునాథరెడ్డి మరణించారన్న విషయాన్ని తెలుసుకున్న భూమన కరుణాకరరెడ్డి హుటాహుటిన తిరుపతి ఆర్డీవో కార్యాలయం సమీపంలోని జయశంకర్‌నగర్‌లో వున్న వారి నివాసానికి చేరుకున్నారు. రఘునాథరెడ్డి భౌతికదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంత్యక్రియలు జరిగేంతవరకు అక్కడే ఉన్నారు. రఘునాథరెడ్డి పాడెను మోసి రుణం తీర్చుకున్నారు.

# డ్రగ్స్ ఉన్నాయంటూ దోపిడీకి యత్నం

- మహిళ మెడలో చైన్ లాక్కెళ్లే ప్రయత్నం





చంద్రగిరి పోలీసు స్టేషన్

**చంద్రగిరి:** 'కారులో డ్రగ్స్ తరలిస్తున్నట్లు సమాచారం అందింది. మీ కారుని తనిఖీ చేయాలి' అంటూ దుండగులు మహిళ మెడలో నుంచి బంగారు చైన్ లాక్కెళ్లేందుకు యత్నించిన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. స్థానికుల వివరాల మేరకు.. శుక్రవారం చిత్తూరు నుంచి తిరుపతికి వస్తున్న ఓ కారు మండల పరిధిలోని పనపాకం సమీపంలోని టోల్‌ప్లాజా దాటుకుని ముందుకు వస్తోంది. కారును వెంబడించిన ముగ్గురు వ్యక్తులు టోల్‌ప్లాజా దాటగానే కారుకు అడ్డంగా ద్విచక్ర వాహనాన్ని ఉంచి కారుని ఆపారు. ఆపై తాము టోల్‌ప్లాజా సిబ్బంది అని, మీ కారులో అక్రమంగా డ్రగ్స్‌ను రవాణా చేస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. కారులో తనిఖీలు చేపట్టాలని హంగామా చేశారు. ఈ క్రమంలో కారులో ఉన్న మహిళ మెడలోని బంగారు చైన్‌ను లాక్కుని పారిపోవడానికి యత్నించడంతో, ప్రయాణికులు కేకలు వేశారు. దీంతో ఒక వ్యక్తిని పట్టుకుని పోలీసులకు అప్పగించగా, సహకరించిన మరో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌లో పారిపోయినట్లు స్థానికులు తెలిపారు. పట్టుబడిన వ్యక్తి పెనుమూరు మండలం, బొంతవంక గ్రామానికి చెందిన లోకేష్‌గా గుర్తించారు. అనంతరం పోలీసులు నిందితుడిని స్టేషన్‌కు తరలించి, విచారిస్తున్నారు. దీనిపై పోలీసులను వివరణ కోరగా.. విచారణ చేపట్టామని, త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు.

# గడువు లోపు నిర్మాణాలు పూర్తి కావాలి



హాజరైన హౌసింగ్ అధికారులు

- జూన్ 10నాటికి 14 వేలు లక్ష్యం
- 5,468 ఇళ్లకు అదనపు నిధులు ఇచ్చాం
- గృహ నిర్మాణశాఖ జిల్లా ప్రత్యేక అధికారి అన్నపూర్ణ

**తిరుపతి అర్బన్:** అందరికీ ఇళ్లు పథకం ద్వారా పేదోళ్లకు అందించిన స్థలాల్లో నిర్మాణాలను ఇచ్చిన గడువు మేరకు పూర్తి చేయాలని హౌసింగ్ జిల్లా స్పెషల్ ఆఫీసర్, చీఫ్ జనరల్ మేనేజర్ అన్నపూర్ణ తెలిపారు. శనివారం ఆమె కలెక్టరేట్‌లో హౌసింగ్ అధికారులతో ఇంటి నిర్మాణాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూన్ 10 నాటికి ఇచ్చిన టార్గెట్ 14 వేల ఇళ్లు పూర్తి చేయాలని ఆదేశించారు. అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మరోవైపు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఇంటి నిర్మాణాలకు సంబంధించి 5,468 మందికి అదనపు ఆర్థిక సాయం చేస్తామని గుర్తుచేశారు. వెంటనే వారంతా ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని స్పష్టం చేశారు. లేదంటే అదనపు నగదుతో పాటు హౌసింగ్ కోసం గతంలో ఇచ్చిన మొత్తాన్ని సైతం రికవరీ చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. అంతేకాకుండా ఇంటిని రద్దు చేస్తామని ఆదేశించారు. హౌసింగ్ అధికారులు సమర్థవంతంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా హౌసింగ్ అధికారి దయాకర్‌కు ఆదేశాలిచ్చారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాస రావుతోపాటు మండలాలకు చెందిన హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

### చెన్నై- నెల్లూరు మెమో రైలు రద్దు

**నాయుడుపేటటౌన్ :** చెన్నై నుంచి నెల్లూరుకు సోమవారం ఉదయం వెళ్లే మెమో రైలును రద్దు చేసినట్లు రైల్వే స్టేషన్ మేనేజర్ చిరంజీవి శనివారం తెలిపారు. పోన్నేరిలో రైల్వే ట్రాక్ మరమ్మతుల కారణంగా మెమో రైలును రద్దు చేసినట్లు వెల్లడించారు.

### నమాజు వ్యవహారంలో కీలక విషయాలు వెల్లడి

**తిరుమల:** తిరుమలలోని కల్యాణ వేదికలో ఓ ముస్లిం వ్యక్తి నమాజు చేసిన ఘటనకు సంబంధించి పోలీసుల దర్యాప్తులో కీలక విషయాలు వెల్లడైనట్లు టీటీడీ ఈవో జె. శ్యామలరావు తెలిపారు. శనివారం స్థానిక అన్నమయ్య భవనంలో టీటీడీ ఈవో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఓ ప్రశ్నకు ఈవో స్పందిస్తూ స్థానిక కల్యాణ వేదికలో ముస్లిం వ్యక్తి నమాజు చేసేలా కొందరు వ్యక్తులు ప్రోత్సహించినట్లు పోలీసుల దర్యాప్తులో తేలిందన్నారు. దీనిపై దేవదాయశాఖ చట్టం ప్రకారం నిందితుడిపై చర్యలు తీసుకుంటున్నట్లు ఈవో స్పష్టం చేశారు.

# ప్రేమోన్మాదంతోనే హత్య



నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

**రాపూరు :** మండలంలోని తాతిపల్లె శివారులో ఈ నెల 16వ తేదీన జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. శనివారం ఈ మేరకు రాపూరు సర్కిల్ కార్యాలయంలో డీఎస్పీ వేణుగోపాల్ వివరాలు వెల్లడించారు. ప్రేమించిన అమ్మాయి దక్కలేదని ఆమె తండ్రి షేక్ షఫీ(50)ని ప్రధాన నిందితుడు సంగ్రపల్లి మస్తాన్ పథకం ప్రకారం మరో ఆరుగురితో కలిసి హత్య చేసినట్లు తెలిపారు. షఫీ కుమార్తెను మస్తాన్ ప్రేమించేవాడని, ఆమెకు వివాహం నిశ్చయమైందని తెలియడంతో సహించలేకపోయాడని చెప్పారు. ఈ క్రమంలోనే షఫీని చంపేయాలని తన స్నేహితులు దాసరి క్రాంతి(గూడూరు), సుదర్శన్ సన్ని (నెల్లూరు రూరల్), రాజశేఖర్ (బిట్రగుంట), సాయిప్రకాష్ (తిప్పగుంట పాళెం చిల్లకూరు మండలం), మలపాటి వెంకట సాయి (నెల్లూరు), తరుణ్ (నెల్లూరు మూలాపేట)తో కలిసి పథకం రూపొందించినట్లు వివరించారు. ఈమేరకు అద్దె కారు తీసుకుని షఫీ నిర్వహించే కూల్‌డ్రింక్ షాపు వద్ద రెక్కీ చేశారన్నారు. 16వతేదీ రాత్రి షఫీ ఇంటికి వెళుతుండగా బలవంతంగా కారులోకి ఎక్కించుకుని రాపూరు మండలం తాతిపల్లె శివారుకు తీసుకెళ్లి కత్తులతో నరికి చంపినట్లు తెలిపారు. అనంతరం నిందితులు కారులో పరారైనట్లు వెల్లడించారు. కేసు దర్యాప్తు చేసి నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులను డీఎస్పీ అభినందించారు. సమావేశంలో సీఐ సత్యనారాయణ, కండలేరు ఎస్ఐ రామకృష్ణ, రాపూరు ఎస్ఐ రాజేష్, సైదాపురం ఎస్ఐ క్రాంతి కుమార్ పాల్గొన్నారు.



# పరిశ్రమల స్థాపనతో అభివృద్ధి



ప్రాజెక్ట్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తదితరులు

**తిరుపతి అర్బన్ :** పరిశ్రమల స్థాపనతో తిరుపతిని అభివృద్ధి పథంలో నడిపించాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పష్టం చేశారు. శనివారం ఓ ప్రైవేట్ హోటల్‌లో సీఐఐ ప్రాజెక్ట్ కింద అభివృద్ధి పథంలో స్వర్ణ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని కలెక్టర్ వెంకటేశ్వర్, సీఐఐ తిరుపతి చైర్మన్ జగన్నాథ్ అనిరుధ్‌తో కలసి ఆయన ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ ప్రతి ఇంట్లో వ్యవస్థాపక సంస్కృతిని పెంపొందించే లక్ష్యంతో 'ఒక కుటుంబం, ఒక వ్యవస్థాపకుడు' అనే ప్రధాన కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఆర్థిక స్వావలంబన, ఆవిష్కరణ, ఉద్యోగ సృష్టికి సమష్టిగా కృషి చేయాలని ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తున్నామని తెలిపారు. సూక్ష్మ పరిశ్రమలకు సైతం ప్రాధాన్యత ఇస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సీఐఐ రాష్ట్ర వైస్ చైర్మన్ నరేంద్ర కుమార్, మాజీ చైర్మన్ విజయ్ నాయుడు గల్లా, తిరుపతి వైస్ చైర్మన్ రాజేంద్రన్ పాల్గొన్నారు.

# మీజిల్స్, రుబెల్లాపై స్పెషల్ డ్రైవ్



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ బాలకృష్ణనాయక్

**తిరుపతి తుడా :** మీజిల్స్, రుబెల్లాపై స్పెషల్ డ్రైవ్‌ను జూలై వరకు వరకు 3 విడతలుగా నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌ఓ బాలకృష్ణ నాయక్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మీజిల్స్, రూబెల్లా అత్యంత ప్రమాదకరమైన అంటువ్యాధులన్నారు. యూనివర్సల్ ఇమ్యునైజేషన్ ప్రోగ్రామ్ కింద మీజిల్స్, రుబెల్లా బారిన పడకుండాపిల్లలకు 2 డోసుల వ్యాక్సిన్ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఇందులో మొదటి డోసు 9-12 నెలల వయసులో, రెండో డోసు 16 నుంచి 24 నెలల వయసులో ఉంటుందని వివరించారు. మొదటి రౌండ్ సోమవారం నుంచి నెల 31 వరకు, రెండో రౌండ్ జూన్ 23 నుంచి 28వరకు, మూడో రౌండ్ జూలై 21 నుంచి 26వ తేదీ వరకు ఉంటుందని తెలిపారు.

# అధికారమే అండగా ఇసుక దందా

**బాలాయపల్లి(సైదాపురం):** బాలాయపల్లి మండలం నిండలి సమీపంలోని కైవల్య నదిలో టీడీపీ నేతలు యథేచ్ఛగా ఇసుకను కొల్లగొడుతున్నారు. అధికారమే అండగా ఇసుక దందా సాగిస్తున్నారు. జేసీబీలతో ఇసుకను ఇష్టారాజ్యంగా తవ్వేసి అక్రమంగా తరలించేస్తున్నారు. ప్రశ్నించిన వారిపై దౌర్జన్యాలకు తెగబడుతున్నారు. మా ప్రభుత్వంలో మమ్మల్ని ఆపే దమ్ము ఎవరికి ఉంది అంటూ పేట్రేగిపోతున్నారు. అక్రమార్కులు మాఫియా ఏర్పడి ఇసుకను ఇతర ప్రాంతాలకు సరఫరా చేసి రూ.కోట్లు వెనకేసుకుంటున్నారు. ప్రధానంగా నిండలితోఆపటు వెంకటరెడ్డి పాళెం, గొల్లపల్లె పరిసరాల్లో కైవల్యానదిని అక్రమార్జనకు అడ్డాగా మార్చేసుకున్నారు. నిత్యం టన్నుల కొద్దీ ఇసుకను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అయితే అధికారులు మాత్రం టీడీపీ నేతల దందాను పట్టించుకోకుండా మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఫిర్యాదు వెల్లువెత్తినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇదే అదునుగా ఇసుకాసురులు అనధికార రీచ్‌లను ఏర్పాటు చేసుకుని రాత్రింబవళ్లు ప్రకృతి సంపదను దోచేసుకుంటున్నారు.

# కుటుంబ కలహాలతో భార్యాభర్త మృతి



మృతి చెందిన సురేష్

**శ్రీకాళహస్తి :** కుటుంబ కలహాలతో భార్యాభర్త మృతి చెందిన ఘటన శ్రీకాళహస్తి పట్టణంలోని కైలాసగిరిలో శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. టూ టౌన్ పోలీసుల కథనం.. స్థానిక కైలాసగిరి కాలనీకి చెందిన సురేష్(30)కు వైజాగ్‌కు చెందిన పద్మ(40) అనే వివాహితతో సామాజిక మాధ్యమం ద్వారా పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్త ప్రేమగా మారింది. ఎనిమిది నెలల కిందట ఇరువురూ వివాహం కూడా చేసుకున్నారు. పద్మకు ఇరవై ఏళ్ల కుమారుడు ఉన్నాడు. ఈ నేపథ్యంలో పద్మతో కలిసి సురేష్ కైలాసగిరి కాలనీలో నివాసముంటున్నాడు. ఈ క్రమంలో ఇటీవల భార్యాభర్తల మధ్య వివాదం తలెత్తింది. పద్మ ఈ నెల 22వ తేదీన ఫ్యానుకు ఉరేసుకుని మృతి చెందగా.. ఆ విషయాన్ని బయటకు పొక్కనీయని సురేష్ చివరకు తాను కూడా మనస్తాపం చెంది శుక్రవారం రాత్రి పురుగుల మందు తాగి తనువు చాలించాడు. శనివారం సురేష్ ఉంటున్న ఇంటి నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న సురేష్‌ను చికిత్స నిమిత్తం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. పద్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి సురేష్ కూడా మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు.


### విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక శిక్షణ



పాఠశాలను పరిశీలిస్తున్న అధికారులు

**శ్రీకాళహస్తి :** విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని, ఇందుకోసం ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టినట్లు సమగ్రశిక్ష జిల్లా కో-ఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శనివారం శ్రీకాళహస్తి మండలం టీజీపీఏ కాలనీలోని ఏపీటీడబ్ల్యూ ఆర్ఎస్ గేల్స్ పీఎం శ్రీ స్కూల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆటిజం సెంటర్‌కు అవసరమైన తరగతి గదులు, మరుగుదొడ్లు, రవాణా సౌకర్యం తదితర అంశాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈఓ బాలయ్య పాల్గొన్నారు.

### పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

**తిరుపతి అర్బన్:** రాస్ ఆధ్వర్యంలో చైల్డ్ ఫండ్ ఇంటర్నేషనల్ ఆర్థిక సహకారంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమ కార్యక్రమాల పోస్టర్‌ను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆవిష్కరించారు. శనివారం కలెక్టరేట్‌లో రాస్ ప్రతినిధుల నేతృత్వంలో కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా పథకాలపై అవగాహన కల్పించేందుకు డీఆర్‌డీఏ సహకారం తీసుకోవాలని సూచించారు. రాస్ ప్రతినిధులు వెంకటరత్నం, రమేష్ రెడ్డి, నాగరాజు, నాగేంద్ర శర్మ పాల్గొన్నారు.

### పులి.. కాదు శునకమే!



పులి జన సంచారంలోకి వస్తే ఎలా ఉంటుంది ? ఏంటి పులి బైక్‌పై వెళుతుందా అనే సందేహం వస్తోందా ? అయితే ఆగండి.. పులి చారలు వేసిన కుక్కను ఓ వ్యక్తి బైక్‌పై తీసుకెళుతుండగా శనివారం తిరుపతి నగరంలో సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది. - సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి